# శ్రేయోభిలాషి

రచన :
మధుశ్రీ

"చిన్న బాబు కొద్దిగా ఆలోచించుకోండి ఎలాంటి వంశమో ఆలోచించే ఈ పని చేస్తున్నారా? తరతరాల నుండీ మీ వంశానికెంత ప్రతిష్ఠ వుందో మీకు తెలీదు. తప్పు బాబు నా మాట విను.... ఆ తల్లిని హింసపెట్టకు.... మీ అమ్మగారు మిమ్మల్ని చూస్తూ బెంగతో కృశించి పోయారు. చనిపోయేటప్పుడెంత మీ కోసం ఆ తల్లి తపించి పోయిందో తెలుసునా బాబూ! ఆ చంటి బిడ్డను చూసైనా మీ మనసు మార్చుకోండి ...ఆ ముండ ఏం విషం పెట్టిందో కాని పూర్తిగా మారిపోయారీమధ్య.... నా బాబుకదూ, నా మాట విను బాబూ" అంటూ బ్రతిమాలే ధోరణిలో వెంకట్రావు చౌదరి గడ్డం పట్టుకుని వీరయ్య తాత హిత బోధ చెయ్యడం ప్రారంభించాడు.

వెంకట్రావు చౌదరి మాట్లాడలేదు....సుశీల గుడ్ల నీళ్ళు గ్రుక్కుకుంటూ గుమ్మం పొవిగిట నిలబడింది... చంకలో కుర్రాడు బోసి నవ్వులు నవ్వుతున్నాడు.

"ఆ తల్లి ముఖంకేసి చూడు బాబూ....ఎలా కుమిలి కుళ్లిపోతూందో.... ఆ తల్లి నిన్నేంచేసింది.... పోనీ ఇంట్లో పడుండనియ్యి....ఆ లీలతోటే తిరుగు....ఆ తల్లి నింట్లో వుండనిస్తే చాలు..."

"వీరయ్యా- నా స్వవిషయంలో గలుగజేసుకో వద్దని ఎన్ని సార్లు చెప్పాలి?.... నా కేసీతులు చెప్పనక్ఖర్లేదు. అట్టే మాట్లాడితే మర్యాద దక్కదు ....జాగ్రత్త..." గుడ్లురిమాడు వెంకట్రావు చౌదరి.

"అలా అనకు బాబూ ఏదో కుర్రతనం చేత అలా అనుకుంటున్నావు....కొడుకు లాంటి వాడివి నన్ను తిట్టినా ఇబ్బందిలేదు....నామాట విను బాబూ..."

"ఛీఛీ రాస్కెల్....ఏమిటి పేల్తున్నావ్? పళ్లురాల్తాయి జాగ్రత్త....ఫోఫో అవతలకి" అంటూ కొట్ట వచ్చినట్టు మాట్లాడాడు. వీరయ్య తాతకి పౌరుషం పెల్లుబికింది! కోపంతో ముఖం వణికింది....కళ్లు నిప్పులు రాలుస్తున్నాయి.... ఎలాగో అంత ఆగ్రహాన్ని నిగ్రహించుకున్నాడు.

"అవును బాబూ మీ మంచికి చెబుతూంటే అలాగే వుంటుంది....కొట్టు బాబూ కొట్టు.... తాతల నాటి నుంచి పనిచేస్తున్నా.... ఆ మహారాజు ఏలోకంలో వున్నారో ఎప్పుడూ పల్లెత్తు మాట కూడా అని ఎరుగరు.... పళ్లూడగొడతావా బాబూ ఊడగొట్టు నాయన...మీ కుటుంబం సేవలోనే నా పళ్ళు ఊడిపోయాయి....ఆఖరికి నా వంట్లో వున్న రక్తమాంసాలు నిన్ను పెంచడానికి ధారపోసేను....ఎంత మాటన్నావు చిన్న బాబూ...." కాస్సేపు సర్దుకున్నాడు. మళ్ళీ ప్రారంభించాడు.

"పోతానులే బాబూ...తరవాత బాధ పడతావు ... పాలలాటి వంశంలో విషపు చుక్కలు జల్లి నవ్వుల పాలు చెయ్యకు....అదేనేను కోరేది.... మీ తాత ఫోటో చూసుకుంటూ వుండు! వెడుతున్నాను బాబూ సెలవు...." పైమీద గుడ్డ దులుపుకుని కన్నీరొత్తుకొని "సుశీలమ్మా బాబూని మార్చే భారం నీది తల్లీ.... ఈ వీరయ్యతాత మీ మంచి మాట వింటే కాని ప్రాణం విడవడమ్మా.... నీదే భారం తల్లీ" వచ్చే కన్నీటినాపుకోలేక పోయాడు. సుశీల కన్నులు మరింత ఆర్ద్రాలైనాయి... మాట్లాడు దామనుకున్న సంగతి గొంతులోనే పూడుకుపోయింది! చంకలో చంటి బిడ్డ "తాత! .... త్తాత..." అంటూ వేలెట్టి చూపెడుతూ ఎత్తుకోమన్నట్లుగా చేతులుచాచాడు.

వెళ్ళిపోతున్న వీరయ్య తాత వెనక్కి తిరిగి చంటి బిడ్డనెత్తుకుని ముద్దాడి "మీ తాతల పేర్లు నిలుపు చిట్టి తండ్రీ" అంటూ ముద్దు పెట్టుకుని తల్లి కందించి తిరిగి వెళ్ళిపోయాడు.

"వెధవ శని ఒదిలిపోయింది.... అఖర్లేని గొడవ లేదు" అన్న వెంకట్రావు చౌదరి మాటలు కొద్దిగా వినిపించాయి వెళ్లిపోతున్న వీరయ్య తాతకి.... అతను వెళ్లిపోతుంటే మండువా ఇల్లు మూలిగింది....

తనకింక ఈ కొంపలో దిక్కెవరనట్లుగా వలవలా విలపించింది సుశీల. తనని ఆదరంతో పలకరించే వారు లేరు....ఇప్పటికే తనకి తన్నులు తగలని రోజులేదు. వీరయ్య తాత పెద్ద దిక్కుగా నిలబడి ఓదార్చేవాడు. ఇప్పుడా అడ్డుకాస్తా లేకుండాపోయింది.... ఏమయినా సరే భర్త తనని చంపినా సరే భర్తని మార్చడానికి ప్రయత్నిస్తాను" అని దృఢ నిశ్చయం చేసుకుంది.

వీరయ్య తాతకి ఎనభై ఏళ్ళు దాటాయి. జీవితంలో మానవుడిన్ని కష్టాల్ని అనుభవించడానికి వీలుందో అన్ని కష్టాలను అనుభవించి ఆ వంశ ప్రతిష్ఠల కోసం మోడై బ్రతుకుతున్నాడు వీరయ్య తాత. యజమాని బాగు కోసం తన సర్వస్వాన్నీ త్యాగం చేశాడు వీరయ్య తాత. యజమాని కూడా తనని ఎప్పుడూ పల్లెత్తు మాటనిఎరుగడు. రానురాను తనతో సమాన హోదానిచ్చాడు. ఆ ఇంట్లో బాగా లోకజ్ఞానం సంపాదించుకున్నాడు దానికితోడు అతనికున్న ఇంగిత జ్ఞానం అతనికి మంచి పేరు తెచ్చింది!

వీరయ్య తాత ఊరు ఊరందరికీ తాతే! ఊళ్లో ఇప్పుడున్న వాళ్లలో పెద్ద. గౌరవంగా మాట్లాడుతాడు. గౌరవిస్తారు. వీరయ్య తాతకి పరాభవం జరిగితే ఎవ్వరూ సహించరు. తనకి జరిగిన పరాభవం ఒక పరాభవంగా అనుకోలేదు.... తన కొడుకుని చూసుకున్నట్లు చూశాడు. పెంచాడు ...ఆ పరాభవం కంటె "వెంకట్రావు చౌదరి పాడయిపోతున్నాడే!" అనే బాధే ఎక్కువగా వుంది. తన భార్యా, తల్లి తండ్రి పోయినప్పుడు తనింత బాధ పడలేదు. కొడుకు తన మాట వినక దేశాంతరం చక్కా పోయినప్పుడు కూడా ఇంత బాధనిపించలేదు. తనకెలాటి ఋణాను బంధంవుందో కాని ఆ కుటుంబంతో ఎంతగా కుమిలి పోతున్నాడో లెక్కలేదు.

వీరయ్య తాత తిన్నగా వెళ్ళి శిథిలా వస్థలోవున్న రామకోవెల అరుగుమీద చతికిల బడి ఒక్క నిట్టూర్పు విడిచాడు!

రామకోవెల అరుగుమీద కూర్చుంటే అతనికి గతించిన స్మృతులన్నీ జ్ఞాపకానికి రాసాగాయి. వెంకట్రావు చౌదరిగారి తాత రామయ్య చౌదరిగారి హైములో ఎంత వైభవంగా అక్కడ రామనవమికి కల్యాణం జరిగేది! అప్పటికి తనకి పదిహేను ఏళ్లే కాబోసు. అంతకుముందే తండ్రి తనని ఆయన దగ్గర పాలికాపు తనానికి కుదిర్చాడు.... అయిదు రోజులు సంతర్పణలు చేయించేవారు....నిత్యకల్యాణం పచ్చతోరణంగా వెలిగిపోయేది ఈ దేవాలయం. ఆయన పేరు చెబితే ఊరంతా హడిలి పోయేవారు. అలాగని ఆయనెవరినీ బాధ పెట్టిఎరుగరు ఆయన కున్న గౌరవానికి భయపడేవారు. తరువాత తనకి ఆయెనే పెళ్ళిచేశాడు. భార్య జ్ఞాపకానికి రాగానే కన్నీళ్ళు గిర్రున తిరిగాయి. రామకోవిలకెదురుగా వున్న ఆయన ఖాళీ దొడ్లో ఒక చిన్న పాకవేసి తనసీ, భార్యనీ అందులో కాపురంవుండమన్నారు. తన భార్య సీతి కూడా ఆ ఇంట్లోనే పని చేసేది. తామిద్దరినీ తమ కుటుంబ సభ్యులలో ఒకరుగా చూచేవారు. భూమిమీద పిల్లవాడిని పారవేసి సీతి స్వర్గస్థురాలైంది! అప్పటి నుండే వీరయ్య జీవితంలో వున్న ఆ కాస్త వెలుగూ కూడా పోయింది... కొడుకుని చూసుకుని ఆ బాధ మర్చిపోయాడు.

వీరయ్యంటే ఆయన కొక గురి వుంది. వీరయ్యని పనిలో ప్రవేశపెట్టింది మొదలు పంటలు సమృద్ధిగా పండటం మొదలు పెట్టాయి. ఆయనకి పట్టింది బంగార మయ్యేది.

తరువాత తరువాత ఆయన పెద్దవాడు కొడుక్కి కూడా పెత్తనాన్నివ్వని రామయ్య చౌదరి వీరయ్యకి పూర్తిగా పెత్తనాన్ని వప్పజెప్పాడు.

కాని స్వార్థానికెప్పుడు తలొగ్గలేదు. ఒక్క దమ్మిడీ జాగ్రత్త పడలేదు. అందుకనే ఇప్పుడు తన దగ్గర చిల్లి గవ్వకూడాలేదు. ఎదురు గుండా తన కోసం కట్టించిన పూరిపాక కూలిపోతూ వుంది! కొడుకు భ్రష్టుడై దూర దేశాల్లో వున్నాడు. ఇప్పుడున్నాడో లేడో కూడా సరీగ్గా తనకి తెలీదు.

ఆ చౌదరిగారు తనని అనేక సార్లు అడిగారు — "వీరయ్యా రోజులెలా మారుతాయో....నీకేభూమి కావాలో కోరుకో నాలుగెకారాలు నీ పేర వ్రాస్తాను.... హాయిగా బ్రతుకుదువు గాని....మా వాళ్ళు తరవాత తరవాత నిన్ను ఇలా చూడకపోవచ్చు...." అని అన్నారు అంతిమ ఘడియల్లో. తనకి బాధ అనిపించింది. "నాకెందుకు బాబయ్యా....నాకు మీరే ఆస్తి.... ప్రత్యేకంగా ఎందుకు? నన్నిలా వుండనియ్యండి బాబయ్యా....ఎవరికోసం ఆని ఆస్తి.... నాకెవరున్నారు మీరు కాక.... మీ కుటుంబం

తాత !...." అని గుడ్లనీళ్ళు గ్రుక్కుకున్నాడు. ఆ మాటలు జ్ఞాపకానికి వచ్చినప్పుడల్లా తనకిప్పటికీ కనీళ్ళు అప్రయత్నంగా కారతాయి !

తనకెవ్వరూలేరూ?....ఊహుఁ.... ! పొరబాటు.... అంతా తన వాళ్ళే ! ఊరంతా తనదే !... ఆ కుటుంబం తనదికాదూ? ఆ చిన్న బాబూ తన వాడుకాడూ? అనుకుంటుంటే కళ్ళు గిర్రున తిరిగాయి.

చౌదరిగారి అంత్య దినాల్లో తను జేసిన సేవకి మురిసిపోయి "నీ ఋణం తీర్చుకోలేను వీరయ్యా !" అంటూండేవారు. "అలాగనకండి బాబయ్యా" అని తననేవాడు. ఆ బాబయ్య కన్ను మూశాడు. ఆయన కొడుకు సుబ్బారాయ చౌదరి కూడా తనని బాగానే చూశాడు. ఆయన అట్టేకాలం బ్రతకలేదు. అప్పుడు కూడా పెత్తనం తన మీదే వుండేది ! తన పెద్దతానానికి గర్వపడేవాడు ! ఆయన పోతూ నాలుగేళ్ళ కొడుకుని, వెంకట్రావు చౌదరిని చేతిలోపెట్టి పోయాడు.

గుఱ్ఱం ఎక్కించుకు తిప్పాడు. ఆటలాడించాడు.... తండ్రి కోసం ఏడుస్తుంటే మరిపించి పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు చెప్పించాడు. "నువ్వుకూడా నాతో చదువుకో తాత లేకపోతే నేచదవను!" అంటే తనూ ఆ కుర్రాడితో చదివాడు. వీరయ్య తాతకి చదువబ్బడానికదో ముఖ్య కారణం కూడాను.

ఏ కుర్రాణ్ణయితే తన చేతులమీదిగా పెంచాడో ఆ కుర్రాడే కంటికి కనపడవద్దన్నాడు ! తిట్టాడు ! రామకోవిల బాగు చేయించమని అనేకసార్లు చెప్పాడు. అది తమకి జయం అని చెప్పాడు. ఆనాడలాంటి భోగాలతో తులతూగిన రామకోవిల ఈ నాడు కూలిపోతూ వుంది.

ఇటు రామకోవిల అటు చిన్ని బాబు పాడయిపోతున్నారు. రామకోవిల బాగుచేస్తే చిన్న బాబు బాగుపడతాడేమో అనిపించింది....

ఇన్నాళ్ళ నుంచీలేనిది ఇప్పుడూళ్ళోకి కూడా తీసుకు వచ్చిపెట్టాడు ఆమనిషిని ... పోనీ ఉంచుకోవచ్చు సుశీలమ్మ ఏంచేసింది....ఆమెనెందుకు బాధించడం?

ఇల్లూ వళ్ళూ కూడా గుల్లవుతున్నాయి...."ఇందులోంచి తప్పించే మార్గంలేదా శ్రీరామచంద్ర ప్రభో !" అనుకున్నాడు.

"ఆ ఆస్తి ఎలాగాపోయింది. ఇప్పటికైనా కన్ను తెరుచుకుని ఉన్నది జాగ్రత్తపెట్టుకుంటే బాగుండును" ఇలా ఆలోచించుకుంటూ రామకోవిల అరుగుమీద పైగుడ్డ పరుచుకుని నడుం వాల్చాడు వీరయ్య తాత.

చీకటి నలుమూలలా ఆవరించుకుంటున్నది. ఎవరి పనుల్లో వాళ్ళు వాళ్ళ వాళ్ళ ఇళ్ళకు పోతున్నారు. వీరయ్యతాత అక్కడెందుకు పడుక్కున్నాడో తెలిసిందికాదు.

అర్ధరాత్రయింది. నిద్రపట్టలేదు. సుశీలని చిన్నబాబు చావకొడుతున్నట్లుగా కల. గబగబా లేచాడు. ప్రొద్దుట నుండీ తిండిలేదు. నడవలేక నడవలేక ఇంటికి వెళ్ళాడు. చిన్నబాబు ఇంట్లోలేడు. ఎందుకో లీల ఇంటికి వెడదామనిపించింది. లీల మేడవద్దకు వెళ్ళాడు. కిటికీలోంచి చూచాడు.

చిన్నబాబు అంత నీచానికి ఒడబడుతున్నాడంటే తనకే సిగ్గువేసింది.

లీల కాళ్ళదగ్గరపడి బ్రతిమాలుతున్నాడు. ఆమె కనికరించడంలేదు. సుశీల తన వొంటినున్న నగలన్నీ వొల్చి ఇచ్చింది. మంగళసూత్రం మాత్రం మిగిలివుంది.

"ఆ వున్న మంగళసూత్రం కూడా పట్టుకొచ్చెయ్యి" అంటూంది లీల.

చిన్నబాబు ఇంటిముఖం పట్టాడు. వీరయ్యతాత నెమ్మదిగా అనుసరించాడు. చిన్నబాబు వాలకంచూస్తే వీరయ్య తాతకి భయం వేసింది. గబగబా నడిచాడు.

సుశీలని లేపాడు. "మంగళసూత్రా లియ్యి" అన్నాడు.

"అవిమాత్రం ఇవ్వలేను,వొద్దు" అంది భయపడుతూ.

"ఇవ్వవూ" అంటూ మూలగానున్న రోకలి పుచ్చుకుని కొట్టెయ్యడాని కెత్తాడు.

"చిన్నబాబూ !" అంటూ వీరయ్యతాత అడ్డంగా నిలబడ్డాడు.

అంతే ! ఆ దెబ్బ వీరయ్యతాత నెత్తిమీద పడింది. "చంపేశావు చిన్నబాబు" అంటూ క్రింద పడిపోయాడు.

చిన్నబాబు కళ్ళు గిర్రున తిరిగాయి. నిలువునా వొణికిపోయాడు

"నేను పెంచిన చేతులతోటే నాకు చావువచ్చింది చిన్నబాబూ ! ఫరవాలేదులే నువ్వు బాగుపడు. అప్పుడే నాకు శాంతి !" అంటూ కన్ను మూశాడు.

"వీరయ్య తాతా ! అని పెద్ద కేకపెట్టి ఏడుస్తూ శవం మీద పడి పిచ్చివాడిలా ఏడవడం మొదలుపెట్టాడు.

ఆనాటినుంచీ చిన్నబాబు పూర్తిగా మారిపోయాడు. "వీరయ్య తాతా నన్ను క్షమించవూ?" అంటూ వీధిలో తిరుగుతున్నాడు.

★